# మహనీయుల ఆశయ సాధనకు కృషి

- మంత్రి జూపల్లి కృష్ణారావు



కల్వరాలలో మాట్లాడుతున్న మంత్రి జూపల్లి కృష్ణారావు

వీపనగండ్ల, జూన్ 20 : మహాత్మాగాంధీ, అంబేద్కర్ వంటి మహనీయుల ఆలోచనా విధానాలను అమలు చేయడమే లక్ష్యంగా ప్రభుత్వం కృషి చేస్తున్నదని ఎక్సైజ్, సాంస్కృతిక పర్యాటక శాఖల మంత్రి జూపల్లి కృష్ణారావు అన్నారు. గురువారం మండల కేంద్రంతోపాటు మండలంలోని కల్వరాలలో పర్యటించి జై బాపు జై భీమ్ జై సంవిధాన్ నినాదంతో ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ.. బ్రిటీష్ పాలనలో వివక్ష, అరాచకాలకు వ్యతిరేకంగా గాంధీ చేపట్టిన శాంతియుత విధానం, రాజ్యాంగ రచన కోసం అంబేద్కర్ ప్రపంచ దేశాల రాజ్యాంగాలను అధ్యయనం చేసి మన దేశం కోసం రచించిన రాజ్యాంగాన్ని కాపాడుకోవాల్సిన బాధ్యత మనందరిపై ఉందన్నారు.

# మక్తల్‌ను ఆదర్శవంతంగా తీర్చిదిద్దుతా

- మంత్రి వాకిటి శ్రీహరి



అమరచింతలో మాట్లాడుతున్న మంత్రి వాకిటి శ్రీహరి

అమరచింత, జూన్ 20 : మక్తల్ నియోజకవర్గాన్ని ఆదర్శవంతంగా అభివృద్ధి చేస్తానని పాడిపరిశ్రమ, మత్స్యశాఖ, క్రీడా యువజనశాఖల మంత్రి వాకిటి శ్రీహరి అన్నారు. శుక్రవారం పట్టణంలోని జెడ్పీ పాఠశాల ఆవరణలో అమరచింత, ఆత్మకూర్ మండలంలోని 241 మందికి ఇందిరమ్మ ఇండ్లు మంజూరు కాగా, అందుకు సంబంధించిన ప్రొసిడింగ్ కాపీలను అందజేశారు. కార్యక్రమంలో కలెక్టర్ ఆదర్శ్ సురభి తదితరులు పాల్గొన్నారు.

**అర్హులకు ఇండ్లు ఇవ్వాలి..**

అర్హులైన వారికి ఇందిరమ్మ ఇండ్లు ఇవ్వాలని మంత్రి వాకిటి శ్రీహరికి వివిధ గ్రామాలకు చెందిన మహిళలు విజ్ఞప్తి చేశారు. అద్దె ఇంట్లో నివాసముంటున్నామని, అర్హులుగా గుర్తించి న్యాయం చేయాలని కోరారు.



విజిలెన్స్ మానిటరింగ్ సమావేశంలో మాట్లాడుతున్న కలెక్టర్ ఆదర్శ్ సురభి

# తప్పు చేస్తే శిక్షించాల్సిందే..

- దోషులెవ్వరూ తప్పించుకోవడానికి వీల్లేదు
- ఎస్సీ, ఎస్టీ కేసులను నిర్లక్ష్యం చేయొద్దు
- వనపర్తి కలెక్టర్ ఆదర్శ్ సురభి
- విజిలెన్స్ అండ్ మానిటరింగ్ కమిటీ సమావేశం

వనపర్తి టౌన్, జూన్ 20 : ఎస్సీ, ఎస్టీలపై లైంగికదాడులు, దౌర్జన్యాలు జరిగితే తప్పు చేసిన వారికి ఖచ్చితంగా శిక్షపడేలా కఠిన చర్యలు తీసుకోవాలని కలెక్టర్ ఆదర్శ్ సురభి ఆదేశించారు. శుక్రవారం కలెక్టరేట్ కాన్ఫరెన్స్ హాల్‌లో జరిగిన మొదటి జిల్లా విజిలెన్స్ అండ్ మానిటరింగ్ కమిటీ సమావేశాన్ని కలెక్టర్ అధ్యక్షత నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ తప్పు చేసిన వారికి చట్టం ప్రకారం ఖచ్చితంగా శిక్ష పడేలా బాధితులకు న్యాయం జరగాలన్నారు. ఒకవేళ తప్పుడు కేసులు నమోదు చేస్తే విజిలెన్స్ కమిటీ సభ్యులు నచ్చజెప్పి కేసు ఉపసంహారించుకునేలా చూడాలని సూచించారు. తప్పుడు కేసులు పెట్టడం, తప్పు చేసినప్పటికీ శిక్ష పడకుండానే బయట రాజీ పడిపోవడం వల్ల చట్టం నీరుగారిపోతుందన్నారు. ఎక్కడైతే ఎస్సీ, ఎస్టీ కేసులు నమోదు అవుతున్నాయో నిశితంగా పరిశీలించి నివేదిక రూపొందిస్తే ఆ ప్రాంతంపై ప్రత్యేక దృష్టి పెట్టి సమస్యను పరిష్కరించవచ్చని పోలీస్ శాఖకు సూచించారు. ప్రతి నెలా 30వ తేదీన నిర్వహించే పౌరహక్కుల దినోత్సవం ఏ గ్రామంలో ఎక్కడ జరుగనున్నదో ముందుగానే షెడ్యూల్ రూపొందించి కమిటీ సభ్యులకు, అధికారులకు ఇవ్వడం జరిగిందని, షెడ్యూల్ ప్రకారం పోలీస్, రెవెన్యూ అధికారులు, విజిలెన్స్ కమిటీ సభ్యులు వెళ్లి హాజరు కావాలన్నారు. ఎస్సీ ఎస్టీ చట్టంలోని షెడ్యూల్-3పై కమిటీ సభ్యులు, స్వచ్ఛంద సంస్థల సభ్యులకు అవగాహన కార్యక్రమం నిర్వహించాలని ఎస్సీ కార్పొరేషన్ ఈడీని ఆదేశించారు.

డీఎస్పీ వెంకటేశ్వరరావు మాట్లాడుతూ 2023 నుంచి ఇప్పటి వరకు జిల్లాలో 58 ఎస్సీ, 10 ఎస్టీ అట్రాసిటీ కేసులు నమోదయ్యాయని తెలిపారు. వీటిలో బాధితులకు మొదటి దశలో 48 మందికి చట్టం ప్రకారం నష్టపరిహారం రూ.2,72,000 మంజూరు చేసి ఇవ్వడం జరిగిందని, రెండో దశలో 25 మందికి రూ.40లక్షలు పరిహారంగా ఇవ్వడం జరిగిందని చెప్పారు. 20 మందికి మంజూరు కాలేదని నివేదిక అందజేశారు. 59 కేసుల్లో చార్జిషీట్ ఫైల్ చేసినట్లు తెలిపారు. అదేవిధంగా 108 పిటీ కేసులు నమోదయ్యాయని, జిల్లా సంక్షేమ శాఖ ద్వారా జిల్లాలో 2024 నుంచి ఎస్సీ ఎస్టీ , 26 పోక్సో కేసులు నమోదయ్యాయని, వాటిలో 17కేసులకు రూ.6,50,000 పరిహారంగా అందజేయడం జరిగిందని కమిటీ దృష్టికి తీసుకొచ్చారు. స్పందించిన కలెక్టర్ పరిహారం రావాల్సిన ప్రతి ఒక్కరికీ పరిహారం ఇచ్చేలా ఎస్సీ, ఎస్టీ కమిషన్‌కు నిధులు మంజురు చేసేందుకు ప్రతిపాదనలు పంపించాలని రెవెన్యూ అధికారులను ఆదేశించారు.

విజిలెన్స్ కమిటీ సభ్యుడు ఎడవల్లి వీరప్ప మాట్లాడుతూ బుడగ జంగం వారిపై దాడులు జరుగుతున్నాయని, ముమ్మాళ్లపల్లి, గోపాల్‌పేట మండలం చాకల్‌పల్లిలో బుడగ జంగం వారిని బెదిరించడం, రచ్చకట్టపై కూర్చోకుండా చేయడం వంటి దౌర్జన్యాలు జరుగుతున్నాయన్నారు. స్పందించిన కలెక్టర్ బెదిరించే వారిపై కేసులు నమోదు చేసి తన దృష్టికి తీసుకురావాలని తెలిపారు. సమావేశంలో అదనపు కలెక్టర్లు వెంకటేశ్వర్లు, యాదయ్య, ఎస్సీ కార్పొరేషన్ ఈడీ మల్లికార్జున్, ఆర్డీవో సుబ్రమణ్యం, డీఆర్‌డీవో పీడీ ఉమాదేవి, కమిటీ సభ్యులు వ్యవసాయ అధికారి గోవింద్ నాయక్, డీఐఈవో అంజయ్య, డీడబ్ల్యూవో సుధా రాణి, విశ్వంబాబు, నాగన్న, రాంచందర్, వీరప్ప, బోజరాజు, స్వచ్ఛంద సంస్థల నుంచి చిన్నమ్మ థామస్, ఏకే రెహమాన్ పాల్గొన్నారు.

# ప్రతి పల్లె అభివృద్ధి సాధించాలి



బాధితుడికి సీఎంఆర్ఎఫ్ చెక్కు అందజేస్తున్న ఎమ్మెల్యే విజయుడు

- ఎమ్మెల్యే విజయుడు

అలంపూర్ చౌరస్తా, జూన్ 20 : అలంపూర్ నియోజకవర్గంలోని ప్రతి పల్లె అభివృద్ధి చెందాలని ఎమ్మెల్యే విజయుడు అన్నారు. శుక్రవారం బాధితుడికి సీఎంఆర్ఎఫ్ ద్వారా మంజూరైన చెక్కును పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ ప్రతి నిత్యం గ్రామాల్లో పర్యటిస్తున్నాని, ప్రజల సమస్యలు తెలుసుకొని పరిష్కరిస్తున్నట్లు తెలిపారు. అనంతరం అయిజ మండలం పులికల్‌కు చెందిన అలీసా, మైబుకు సీఎంఆర్ఎఫ్ పథకం కింద రూ.49వేలను అందించామన్నారు.

## గురుకులాలకు విద్యార్థుల ఎంపిక

- టీసీలు ఇవ్వని ప్రైవేట్ పాఠశాల యాజమాన్యం

వడ్డేపల్లి, జూన్ 20 : మండలంలోని రామాపురంలోని ఓ ప్రైవేట్ పాఠశాల నుంచి 51మంది విద్యార్థులు గురుకుల ప్రవేశ పరీక్ష రాయగా, అందరూ ఉత్తీర్ణత చెందారు. బాల్‌నగర్, బీచుపల్లి, భూత్పూర్, మక్తల్, హైదరాబాద్, జడ్చర్ల తదితర ప్రాంతాల్లోని గురుకులాల్లో సీట్లు పొందారు. వారికి టీసీలు ఇవ్వకుండా జాప్యం చేస్తున్నారని విద్యార్థుల తల్లితండ్రులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. టీసీ తీసుకొస్తేనే గురుకులాల్లో చేర్చుకుంటామని అధికారులు చెబుతుండడంతో విద్యార్థుల తల్లితండ్రులు ఆందోళన చెందుతున్నారు. పాఠశాల యాజమాన్యాన్ని ఈ విషయమై వివరణ కోరగా, టీసీలు ఇవ్వలేకపోవడానికి ఎంఈవోనే కారణమని తెలిపారు. ఎంఈవోను వివరణ కోరగా, ప్రైవేట్ పాఠశాల స్థల వివాదం ఉన్నందునే టీసీలను నిలిపి వేశామని, త్వరలో విద్యార్థులకు అందజేస్తామన్నారు.

# సహజపద్ధతిలో పంటలు సాగు చేయాలి

- జిల్లా వ్యవసాయశాఖ అధికారి సక్రియానాయక్



ఉదండాపురంలో మట్టి నమూనా సేకరించి రైతులతో మాట్లాడుతున్న డీఏవో

ఇటిక్యాల, జూన్ 20 : రైతులు సహజపద్ధతిలో పంటలను సాగుచేయాలని జిల్లా వ్యవసాయశాఖ అధికారి సక్రియానాయక్ సూచించారు. మండలంలోని ఉదండాపురంలో శుక్రవారం ఆయన సహజపద్ధతిలో పంటను సాగు చేపట్టే రైతు పొలంలో మట్టినమూనా పరీక్షలకు (రైతుల సమక్షంలో) శాంపిల్స్‌ను సేకరించారు. అనంతరం రైతులనుద్దేశించి మాట్లాడుతూ జిల్లాలో రైతులతో ప్రకృతిసేద్యం చేయించేందుకు సెంటర్‌ఫర్ సస్టెన్‌బుల్ అగ్రికల్చర్ పథకం కింద 20క్లస్టర్లు మంజూరయ్యాయన్నారు. డీఆర్‌డీవో సహకారంతో ఏర్పాటు కానున్న ఈ క్లస్టర్‌లో 125మంది రైతులతో 50హెక్టార్ల భూమి సాగుచేయించడం జరుగుతుందన్నారు. ఇటిక్యాల మండలానికి ఒక క్లస్టర్, ఎర్రవల్లి మండలానికి రెండు క్లస్టర్లు మంజూరయ్యాయని డీఏవో తెలిపారు. కార్యక్రమంలో మండల వ్యవసాయశాఖ అధికారి రవికుమార్, రైతులు పాల్గొన్నారు.

## తుంగభద్రకు స్థిరంగా వరద

అయిజ, జూన్ 20 : కర్ణాటకలోని ఎగువ ప్రాంతాల్లో కురుస్తున్న వర్షాలకు తుంగభద్రకు వరద స్థిరంగా కొనసాగుతోంది. తుంగ బరాజ్ గేట్లు ఎత్తి వరద నీటిని దిగువకు విడుదల చేస్తున్నారు. దీంతో శుక్రవారం తుంగభద్ర డ్యాంకు ఇన్‌ఫ్లో 50,686, అవుట్ ఫ్లో 256 క్యూసెక్కులు ఉన్నది. 105.788 టీఎంసీల నీటి నిల్వ సామర్థ్యానికి గానూ ప్రస్తుతం 38.608 టీఎంసీల నీటి నిల్వ ఉన్నది. ఆర్డీఎస్ ఆనకట్టకు ఇన్‌ఫ్లో నిలిచిపోయింది. కన్‌స్ట్రక్షన్ స్లూయిస్ ద్వారా సుంకేసుల బరాజ్‌కు 195 క్యూసెక్కులు చేరుతుండగా, ఆర్డీఎస్ ప్రధానకాల్వకు 457 క్యూసెక్కులు విడుదల చేస్తున్నారు.

## ప్రైవేట్ స్కూళ్లపై చర్యకు డిమాండ్

అయిజ, జూన్ 20 : పట్టణంలోని ప్రైవేట్ పాఠశాలల యాజమాన్యాలు అధిక ఫీజులు వసూళ్లు చేస్తున్నాయని, అధికారులు చర్యలు తీసుకోవాలని బీఆర్ఎస్, బీఆర్ఎస్వీ నాయకులు వెంకటేశ్, వీరేశ్ డిమాండ్ చేశారు. శుక్రవారం అయిజలో విలేకరుల సమావేశంలో వారు మాట్లాడారు. అయిజలోని ప్రైవేట్ పాఠశాలల యాజమాన్యాలు మాఫియాగా ఏర్పడి ప్రభుత్వ నిబంధనలు తుంగలో తొక్కి అధిక ఫీజులు వసూళ్లు చేస్తున్నట్లు ఆరోపించారు. పాఠశాలల్లోనే నోట్ పుస్తకాలు, యూనిఫాంలు తదితర వస్తువులను విక్రయిస్తూ వ్యాపారంగా మార్చాయన్నారు. విద్యాశాఖ అధికారులు పర్యవేక్షణ చేయాలని కోరారు. సమావేశంలో ముత్తాలి, రవి, నరేశ్ తదితరులు పాల్గొన్నారు.

## స్థానిక ఎన్నికలకు సిద్ధం కావాలి

పెబ్బేరు, జూన్ 20 : గ్రామాల్లోని కార్యకర్తలు స్థానిక సంస్థల ఎన్నికలకు సిద్ధం కావాలని పెబ్బేరు మండల బీఆర్ఎస్ నాయకులు విజ్ఞప్తి చేశారు. శుక్రవారం వారు పలు గ్రామాల్లో పర్యటించి కార్యకర్తలతో సమావేశమయ్యారు. ఈ సందర్భంగా బీఆర్ఎస్ మండల అధ్యక్షుడు రాములు, పెబ్బేరు మున్సిపల్ మాజీ వైస్ చైర్మన్ కర్రెస్వామి మాట్లాడుతూ కాంగ్రెస్ ప్రభుత్వం మాయమాటలు చెప్పి అధికారంలోకి వచ్చిందన్నారు. ప్రజలకు ఇచ్చిన హామీలను నెరవేర్చకుండా పబ్బం గడుపుతున్నదని, ప్రజలకు చెప్పి ఓడగొట్టేందుకు ప్రయత్నించాలన్నారు. కార్యక్రమంలో వెంకటేశ్, సత్యారెడ్డి, దిలీప్‌రెడ్డి, ఈశ్వర్, రమేశ్, గోవిందు పాల్గొన్నారు.

## ఇద్దరు టీచర్లకు మెమోలు జారీ

వడ్డేపల్లి, జూన్ 20 : మండలంలోని ప్రభుత్వ పాఠశాలలో విధులు నిర్వహిస్తున్న ఇద్దరు ఉపాధ్యాయులకు మెమోలు జారీ చేసినట్లు ఎంఈవో నరసింహ శుక్రవారం ప్రకటనలో పేర్కొన్నారు. రామాపురం-1 పాఠశాలకు చెందిన ధనుంజయ ఉపాధ్యాయ శిక్షణకు హాజరు కాకపోగా, అటెండెన్స్ సర్టిఫికెట్ డీడీవోకు అందించనందుకు మెమో జారీ చేశారు. అలాగే వెంకట్రామనగర్ పాఠాశాలకు చెందిన ఈశ్వరయ్య డిప్యూటేషన్ గురించి అధికారులకు లేఖ ఇవ్వకుండా హెచ్‌ఎం వాట్సాప్ గ్రూపులో పెట్టినందునా క్రమశిక్షణ రహితంగా భావిస్తూ వివరణ ఇవ్వాలని మెమో జారీ చేశారు.

## ఇద్దరికి గాయాలు

మల్దకల్, జూన్ 20 : మండలంలోని అమరవాయిలో లారీ నుంచి బియ్యం బస్తాలు పడి ఇద్దరు మహిళలకు తీవ్రగాయాలైన ఘటన చోటుచేసుకున్నది. గ్రామస్తుల కథనం ప్రకారం.. అమరవాయి నుంచి గద్వాలకు రేషన్ బియ్యం లారీ వెళ్తుండగా వ్యవసాయ పనులకు వెళ్లి తిరిగి వస్తున్న మహిళలపై లారీ నుంచి బియ్యం బస్తాలు పడ్డాయి. ఈ ప్రమాదంలో సత్యమ్మ, సుస్మితలు తీవ్రంగా గాయపడ్డారు. వెంటనే వారిని ప్రభుత్వ దవాఖానకు తరలించారు. విషయం తెలుసుకున్న నడిగడ్డ హక్కుల పోరాట సమితి నాయకులు లవన్న, విష్ణు, రాముడు, నాగేశ్, గోపాల్ దవాఖానకు వెళ్లి బాధితులను పరామర్శించారు.

# దివ్యాంగులు వివరాలు నమోదు చేసుకోవాలి

వనపర్తి టౌన్, జూన్ 20 : దివ్యాంగులు పీఎం దక్ష యోజనలో వివరాలు నమోదు చేసుకోవాలని జిల్లా న్యాయ సేవాధికార సంస్థ కార్యదర్శి, సీనియర్ సివిల్ జడ్జి వి.రజిని అన్నారు. శుక్రవారం జిల్లా కేంద్రంలోని దివ్యాంగుల పునరావాస కేంద్రంలో చట్టాలపై అవగాహన సదస్సు నిర్వహించారు. దివ్యాంగ్ జన్‌రోజ్‌గల్ సేతు, దివ్యాంగ్ జన్ కౌశల్ వికాస్ పథకాల గురించి వివరించారు. ఉచిత న్యాయ సేవల కోసం 15100 టోల్ ఫ్రీం నెంబర్‌ను సంప్రదించాలని సూచించారు. కార్యక్రమంలో డిప్యూటీ లీగల్ ఎయిడ్ ఉత్తరయ్య తదితరులు పాల్గొన్నారు.

## ధైర్యాన్ని కల్పించేందుకే కవాతు

వనపర్తి టౌన్, జూన్ 20 : ప్రజల్లో ధైర్యాన్ని కల్పించేందుకు ర్యాపిడ్ యాక్షన్ ఫోర్స్ కవాతు నిర్వహిస్తున్నామని ఎస్సై హరి ప్రసాద్ అన్నారు. శుక్రవారం జిల్లా కేంద్రంలోని శంకర్‌గంజ్ నుంచి అరబ్బుగల్లీ, పాత బజార్, గాంధీనగర్, మారెమ్మకుంట, రాజీవ్‌చౌక్, బస్టాండ్ మీదుగా రామాలయం వరకు కవాతును నిర్వహించారు. కార్యక్రమంలో ట్రాఫిక్ ఎస్సై సురేందర్, శిక్షణ ఎస్సై హిమబిందు తదితరులు పాల్గొన్నారు.

**పోలీసుల ఫ్లాగ్ మార్చ్**

గోపాల్‌పేట, జూన్ 20 : స్థానిక పోలీసులు రాపిడ్ యాక్షన్ ఫోర్స్‌తో కలిసి మండలంలోని బుద్ధారం, పొల్కెపహాడ్ గ్రామాల్లోని వీధుల గుండా శుక్రవారం ఫ్లాగ్ మార్చ్ నిర్వహించారు. కార్యక్రమంలో ఎస్సై నరేశ్‌కుమార్, రాపిడ్ యాక్షన్ ఫోర్స్ ఇన్‌స్పెక్టర్ రాముడు, ఏఎస్సై రాములు పాల్గొన్నారు.

## కార్మికులపై వేధింపులు ఆపాలి

వనపర్తి టౌన్, జూన్ 20 : ప్రభుత్వ మెడికల్ కళాశాల కార్మికులపై ఏజెన్సీ వేధింపులు ఆపాలని, సుప్రీంకోర్టు తీర్పు మేరకు సమాన పనికి సమాన వేతనం ఇవ్వాలని తెలంగాణ మెడికల్ కాంట్రాక్ట్ వర్కర్స్ యూనియన్ రాష్ట్ర కార్యదర్శి పి.సురేశ్ అన్నారు. శుక్రవారం జిల్లా కేంద్రంలోని ప్రభుత్వ మెడికల్ కళాశాలలో తెలంగాణ మెడికల్ కాంట్రాక్ట్ వర్కర్స్ యూనియన్ రాష్ట్ర కార్యదర్శి సురేశ్ సర్వే చేపట్టారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పారిశుద్య సెక్యూరిటీ సూపర్విజన్ నిర్వహణ కోసం ప్రభుత్వం అనుమతి ఇచ్చిన రాజ్‌దిప్ ఏజెన్సీ కాంట్రాక్టర్ నిర్వహకులు అక్కడ పనిచేస్తున్న పారిశుద్య సెక్యూరిటీ కార్మికులపై పన్మిష్మెంట్ పేరుతో రోజుల తరబడి విధులకు రానివ్వకుండా వేధిస్తున్నారన్నారు. మే డే రోజున సెలవు ఇవ్వకుండా కార్మికుల వేతనాల్లో కోతలు పెట్టారని తెలిపారు.

## విశ్వవాణి గ్రామాభివృద్ధి సంఘం కమిటీ ఎన్నిక

గోపాల్‌పేట, జూన్ 20 : మండలంలోని బుద్దారంలో శుక్రవారం గ్రామ విశ్వవాణి గ్రామాభివృద్ధి సంఘం నూతన కమిటీని ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. అధ్యక్షుడిగా పూల్యానాయక్, ఉపాధ్యక్షులుగా ఓంకార్, శేఖర్, ఓంకార్, విష్ణువర్ధన్‌రావు, జాంప్లానాయక్, నానునాయక్, సత్యం, ఎస్.వెంకటస్వామి, పి.కురుమయ్య, ప్రధాన కార్యదర్శిగా టి.ఉమామహేశ్వర్, కోశాధికారిగా శివకుమర్, సంయక్త కార్యదర్శిగా వెంకటయ్య, హనుమంతు, సురేష్‌నాయక్, గోపాల్‌రావు, పరుశురాములు, పెంటారావు, చిన్న నర్సింహ్మా, తార్యా నాయక్, సలహాదారులుగా శేఖర్‌గౌడ్, అమర్‌నాథ్‌ను ఎన్నుకున్నారు.

## బీసీ విద్యార్థి సంఘం జిల్లా అధ్యక్షుడిగా లోకేష్

వనపర్తి టౌన్, జూన్ 20 : బీసీ విద్యార్థి సంఘం జిల్లా అధ్యక్షుడిగా లోకేష్‌యాదవ్ నియామకమయ్యారు. హైదరాబాద్‌లోని జాతీయ బసీ సంక్షేమ సంఘం రాష్ట్ర కార్యాలయంలో జాతీయ అధ్యక్షుడు ఆర్.కృష్ణయ్య ఆధ్వర్యంలో వనపర్తి జిల్లా కమిటీ ఎన్నుకున్నారు. అధ్యక్షుడిగా లోకేష్‌యాదవ్, ఉపాధ్యక్షులుగా శ్రీకాంత్‌గౌడ్, శివాజీ, ప్రధాన కార్యదర్శిగా మహేశ్, కార్యదర్శులుగా కేఎన్ షఫీని నియమించారు.

# లక్కీడిప్ ద్వారా విద్యార్థుల ఎంపిక



చర్లపల్లిలో మార్కెట్ గోడౌన్ కోసం స్థలాన్ని పరిశీలిస్తున్న అదనపు కలెక్టర్‌వెంకటేశ్వర్లు

గద్వాల అర్బన్, జూన్ 20 : బెస్ట్ అవేలబుల్ పాఠశాలల్లో ఎస్సీ విద్యార్థులు ఉచితంగా చదివేందుకు లక్కీడిప్ ద్వారా ఎంపిక చేసినట్లు అదనపు కలెక్టర్ నర్సింగరావు తెలిపారు. శుక్రవారం జిల్లా కేంద్రంలోని ఐడీవోసీ సమావేశపు మందిరంలో షెడ్యూల్డ్ కులాల అభివృద్ధి శాఖ ఆధ్వర్యంలో బెస్ట్ అవేలబుల్ పాఠశాలల్లో చేరేందుకు దరఖస్తు చేసుకున్న విద్యార్థులను తల్లిదండ్రుల సమక్షంలో అదనపు కలెక్టర్ లక్కీడిప్ ద్వారా ఎంపిక చేశారు. ఒకటవ తరగతిలో చేరేందుకు 57 సీట్లు, 5వ తరగతిలో చేరేందుకు 59సీట్లు కేటాయించగా, మొత్తం 760 మంది విద్యార్థులు దరఖస్తు చేసుకున్నారన్నారు. గ్రూప్ వారిగా 33శాతం రిజర్వేషన్లు బాలికలకు కేటాయించగా, మిగిలిన సీట్లను జనరల్ కోటాలో లక్కీడిప్ తీసినట్లు తెలిపారు. ఎంపికైన విద్యార్థులు తమ ధ్రువపత్రాలతో ఎస్సీ సంక్షేమ శాఖ కార్యాలయంలో సంప్రదించాలన్నారు. కార్యక్రమంలో ఎస్సీ కార్పొరేషన్ ఈడీ రమేశ్‌బాబు తదితరులు పాల్గొన్నారు.

**రేషన్ దుకాణం మార్కెట్ గోడౌన్‌కు స్థల పరిశీలన**

కొత్తకోట, జూన్ 20 : మండలంలోని చర్లపల్లిలో చౌకధర దుకాణాన్ని అదనపు కలెక్టర్ వెంకటేశ్వర్లు ఆకస్మికంగా తనిఖీ చేశారు. రేషన్ దుకాణంలో పంపిణీ అవుతున్న బియ్యం నాణ్యతను పరిశీలించారు. లబ్ధిదారులతో మాట్లాడి సరుకులు సరిగా అందుతున్నాయా లేదా అని అడిగి తెలుసుకున్నారు. పంపిణీలో ఎటువంటి లోపాలు లేకుండా చూడాలని నిర్వాహకులకు సూచించారు. అనంతరం చర్లపల్లి మార్కెట్ గోడౌన్ నిర్మాణం కోసం ఉద్దేశించిన స్థలాన్ని అదనపు కలెక్టర్ పరిశీలించారు. కార్యక్రమంలో తాసీల్దార్ వెంకటేశ్వర్లు, స్థానిక ప్రజాప్రతినిధులు పాల్గొన్నారు.

# చెడు అలవాట్లకు దూరంగా ఉండాలి




మాట్లాడుతున్న సంక్షేమ శాఖజిల్లా అధికారి సుధారాణి

మదనాపురం, జూన్ 20 : విద్యార్థులు చెడు అలవాట్లకు దూరంగా ఉండి బంగారు భవిష్యత్ కోసం పాటుపడాలని జిల్లా సంక్షేమశాఖ అధికారి సుధారాణి సూచించారు. అంతర్జాతీయ మాదకద్రవ్య దుర్వినియోగం, అక్రమ రవాణా వ్యతిరేక దినోత్సవ వారోత్సవాల్లో భాగంగా శుక్రవారం మండల కేంద్రంలోని సాంఘిక సంక్షేమ గురుకుల బాలుర పాఠశాల, కళాశాలలో అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా సుధారాణి మాట్లాడుతూ చెడు వ్యసనాలకు అలవాటు పడితే జీవితం అంధకారం అవుతుందన్నారు. కార్యక్రమంలో బాలల పరిరక్షణ అధికారి రాంబాబు, సూపరింటెండెంట్ అరుంధతి, జూనియర్ అసిస్టెంట్ వెంకటస్వామి, కళాశాల ప్రిన్సిపాల్ ప్రమోదిని పాల్గొన్నారు.

## ఆర్థిక ఇబ్బందులతో వ్యక్తి ఆత్మహత్య

అయిజ రూరల్, జూన్ 20 : ఆర్థిక ఇబ్బందులతో వ్యక్తి ఆత్మహత్యకు పాల్పడిన ఘటన మండలంలోని యాపదిన్నెలో శుక్రవారం చోటుచేసుకున్నది. ఎస్సై శ్రీనివాసరావు కథనం ప్రకారం.. గ్రామానికి చెందిన కుమ్మరి రవి(32) భార్య ఎల్లమ్మతో కలిసి కూలీ పనులు చేస్తూ జీవనం కొనసాగిస్తుండేవాడన్నారు. ఆర్థిక ఇబ్బందులు వల్ల మద్యానికి బానిసై గురువారం ఇంట్లో ఎవరూ లేని సమయంలో పురుగుల మందు తాగాడన్నారు. భార్య ఎల్లమ్మ కూలీపనుల నుంచి వచ్చి చూసి చికిత్స కోసం కర్నూల్ దవాఖానకు తరలించారు. చికిత్స పొందుతూ శుక్రవారం మృతిచెందాడని తెలిపారు. మృతుడి తండ్రి సాయన్న ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై శ్రీనివాసరావు తెలిపారు.

## బాధితుడికి సెల్‌ఫోన్ అప్పగింత

గోపాల్‌పేట, జూన్ 20 : మండల కేంద్రానికి చెందిన ఆలూరు కృష్ణయ్య 2023 డిసెంబర్‌లో సెల్‌ఫోన్ పోగొట్టుకొని పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేశాడు. కేసు నమోదు చేసిన పోలీసులు, రికవరీ చేసిన సెల్‌ఫోన్‌ను శుక్రవారం ఎస్సై నరేశ్‌కుమార్ బాధితుడి కుమారుడు మహేశ్‌కు అందజేశారు.

## సీసీ కెమెరాల ఏర్పాటుకు విరాళం

కొత్తకోట, జూన్ 20 : పట్టణంలో నేర నియంత్రణలో భాగంగా ప్రధాన కూడళ్లలో సీసీ కెమెరాల ఏర్పాటుకు తుఫాన్ అసోసియేషన్ ఆధ్వర్యంలో స్వచ్ఛందంగా రూ.50వేల విరాళాన్ని శుక్రవారం ఎస్సై ఆనంద్ సమక్షంలో గుత్తేదారు అందజేశారు. ఈ సందర్భంగా ఎస్సై అసోసియేషన్ వారిని అభినందించారు.

## స్నేహితుడికి ఆర్థికసాయం

పెద్దమందడి, జూన్ 20 : మండలంలోని మద్దిగట్లకు చెందిన శ్రీను అనారోగ్యంతో బాధపడుతూ ఆర్థికంగా ఇబ్బందులు పడుతున్నాడు. విషయం తెలుసుకున్న మద్దిగట్ల ప్రభుత్వ పాఠశాల 2004-2005 ఎస్ఎస్‌సీ బ్యాచ్‌లో చదువుకున్న వాకిటి శ్రీను స్నేహితుడు జీవన్ జీవనోపాధి కోసం వివిధ ప్రాంతాలకు వెళ్లిన వారి స్నేహితులకు సమాచారం ఇవ్వగా, అందరూ కలిసి రూ.21వేలు పోగు చేసి శుక్రవారం బాధిత కుటుంబానికి అందజేశారు. కార్యక్రమంలో ఆర్.వెంకటేష్‌గౌడ్, పి.సాగర్‌కుమార్, ఎం.కృష్ణయ్య, పి.రామ్‌సాగర్ తదితరులు పాల్గొన్నారు.

**పాన్‌గల్‌లో..**

పాన్‌గల్, జూన్ 20 : మండల కేంద్రానికి చెందిన ఆది కరుణాకర్(36) శుక్రవారం గుండెపోటుతో మృచెందాడు. విషయం తెలుసుకున్న గ్రంథాలయ సంస్థ జిల్లా మాజీ చైర్మన్ గోవర్ధన్‌సాగర్, మాజీ ఎంపీపీ శ్రీధర్‌రెడ్డి, మాజీ జెడ్పీటీసీ రవి, మాజీ ఎంపీపీ వెంకటేశ్‌నాయుడు బాధిత కుటుంబాన్ని పరామర్శించారు. మాజీ ఎంపీపీ శ్రీధర్‌రెడ్డి రూ.10వేల ఆర్థికసాయం అందజేశారు. పరామర్శించిన వారిలో నాయకులు వెంకటయ్యానాయుడు, మాజీ సర్పంచులు గో పాల్‌రెడ్డి, నాయకులు వెంకటయ్య నాయుడు, బ్రహ్మయ్య, నరేందర్‌గౌడ్, భాస్కర్‌రెడ్డితోపాటు తదితరులు పాల్గొన్నారు.

**బాధిత కుటుంబానికి..**

గోపాల్‌పేట, జూన్ 20 : మండల కేంద్రానికి చెందిన గంధం గోకారయ్య(75) అనారోగ్యంతో మృతిచెందగా, శుక్రవారం రాంనగర్ కాలనీ సేవా సమితి సభ్యులు బాధిత కుటుంబాన్ని పరామర్శించారు. రూ.6వేల ఆర్థికసాయం అందజేశారు. పరామర్శించిన వారిలో ఎల్లయ్య, కృష్ణయ్య, వెంకట్, రాములు, రాజు, స్వామి, నాగరాజు, చంద్రశేఖర్, లక్ష్మణ్, రమేశ్ తదితరులు ఉన్నారు.

- జోగులాంబ గద్వాల కలెక్టర్ సంతోష్

# ఎల్‌ఆర్‌ఎస్ రాయితీ గడువు పొడిగింపు

గద్వాల అర్బన్, జూన్ 20 : ప్రజల నుంచి వస్తున్న వినతులను దృష్టిలో పెట్టుకొని లేఅవుట్లను 25శాతం రాయితీతో క్రమబద్ధీకరణ చేసుకునేందుకు గడువును ప్రభుత్వం ఈనెల 30వ వరకు పొడిగించినట్లు కలెక్టర్ సంతోష్ శుక్రవారం ప్రకటనలో పేర్కొన్నారు. జిల్లాలో ఇంకా ఎల్‌ఆర్‌ఎస్ కట్టని వారు 19, 485మంది ఉన్నారని, సద్వినియోగం చేసుకోవాలన్నారు.

**సద్వినియోగంచేసుకోవాలి..**

అయిజ, జూన్ 20 : ఎల్‌ఆర్‌ఎస్ గడువును ఈనెల 30వ తేదీ వరకు ప్రభుత్వం పొడిగించిందని మున్సిపల్ కమిషనర్ సైదయ్య శుక్రవారం ప్రకటనలో పేర్కొన్నారు.

## డిగ్రీలో అడ్మిషన్ల గడువు పెంపు

వడ్డేపల్లి, జూన్ 20 : శాంతినగర్‌లోని ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో మూడో విడత డిగ్రీ అడ్మిషన్లకు ఈనెల 25వ తేదీ వరకు గడువు పొడిగించినట్లు కళాశాల ప్రిన్సిపాల్ రమా ఓబులేశు శుక్రవారం ప్రకటనలో పేర్కొన్నారు. కళాశాలలో బీఏ, బీకాం, బీఎస్సీ తదితర కోర్సులు ఉన్నాయని, కళాశాలలో విద్యార్థుల సౌకర్యార్థం దోస్త్ హెల్ప్‌లైన్ సెంటర్‌ను అందుబాటులోకి తెచ్చామని కోఆర్డినేటర్ ఏడుకొండలు తెలిపారు. వివరాల కోసం ఎం.బీసన్న 9398474345, ప్రసాద్-9642399320 నెంబర్లను సంప్రదించాలన్నారు.

## నియామకాల కోసం దరఖాస్తుల ఆహ్వానం

వనపర్తి టౌన్, జూన్ 20 : స్టాఫ్ సెలక్షన్ కమిషన్ ద్వారా సీజీఎల్ నియామకం కోసం అభ్యర్థులు ఆన్‌లైన్ రిజిస్ట్రేషన్, అప్లికేషన్ ద్వారా దరఖాస్తు చేసుకోవాలని జిల్లా ఉపాధి కల్పన అధికారి ఎండీ జానీపాషా శుక్రవారం ప్రకటనలో పేర్కొన్నారు. సీజీఎల్‌లో వివిధ కేటరిరీల వారీగా ఇన్‌స్పెక్టర్ ఆఫ్ ఇన్‌కం ట్యాక్స్ అండ్ వేరియస్ టైప్స్ ఆఫ్ ఇన్‌స్పెక్టర్, ఆడిట్ ఇన్ ఆఫీస్ అండర్‌కు ఏదైనా డిగ్రీ ఉత్తీర్ణత కలిగి ఉండాలని చెప్పారు. అభ్యర్థులు వారి అర్హత ఆధారంగా ఏవైనా కేటగిరీలకు, దరఖాస్తు చేసుకోవచ్చని పేర్కొన్నారు. అభ్యర్థులు ssc.gov.in వెబ్‌సైట్‌లో జులై 4వ తేదీ వరకు దరఖాస్తు చేసుకోవాలని చెప్పారు.

## ఆయిల్‌ఫెడ్ ఏడీగా శివనాగిరెడ్డి

ఇటిక్యాల, జూన్ 20 : బీచుపల్లి విజయవర్దనే ఆయిల్ ఫెడ్ ఏడీగా శివనాగిరెడ్డి నియమితులైనట్లు మండల వ్యవసాయ శాఖ అధికారి రవికుమార్ తెలిపారు. వనపర్తి జిల్లా వ్యవసాయ శాఖలో సాంకేతిక ఏడీగా విధులు నిర్వహిస్తున్న ఆయన శుక్రవారం ఆయిల్‌ఫెడ్ ఏడీగా బాధ్యతలు చేపట్టారన్నారు.

## రైతుభరోసా 11,476 ఖాతాల్లో జమ

వనపర్తి టౌన్, జూన్ 20 : ఈ నెల 16వ తేదీ నుంచి ఇప్పటి వరకు ఐదె ఎకరాల వరకు ఉన్న 11,476 మంది రైతుల ఖా తాల్లో రూ.30,05,62,758 జమ చేసినట్లు జిల్లా వ్యవసాయశాఖ అధికారి గోవింద్ నాయక్ శుక్రవారం ప్రకటనలో పేర్కొన్నారు.

## ప్రభుత్వ పాఠశాలల్లో మెరుగైన విద్య

ధరూరు, జూన్ 20 : ప్రభుత్వ పాఠశాలల్లో మెరుగైన విద్యాబోధన, నాణ్యమైన మధ్యాహ్న భోజనం అందిస్తున్నట్లు మండల విద్యాశాఖ అధికారి రవీంద్రబాబు అన్నారు. శుక్రవారం మండలంలోని మన్నాపురం పాఠశాలలో మధ్యాహ్న భోజనం తయారు కోసం నూతణంగా గ్యాస్ స్టవ్‌ను ప్రారంభించారు.

## విద్యార్థులకు మెమెంటోలు అందజేత

వనపర్తి టౌన్, జూన్ 20 : జిల్లా కేంద్రంలోని ప్రభుత్వ బాలుర ఉన్నత పాఠశాల విద్యార్థులు పదో తరగతి ఫలితాల్లో ఉత్తమ మార్కులు సాధించి టాపర్లుగా నిలిచారు. వీరికి ప్రభుత్వ దవాఖాన వైద్యుడు గిరిధర్ శుక్రవారం రూ.2వేల నగదుతో ప్రోత్సాహక బహుమతితోపాటు మెమెంటో ప్రధానం చేశారు.

## వైద్య పరీక్షలు

మల్దకల్, జూన్ 20 : మండల కేంద్రంలోని ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో శుక్రవారం ప్రజలకు 76 రకాల వైద్య పరీక్షలు నిర్వహించినట్లు మండల వైద్యాధికారి స్వరూపారాణి తెలిపారు.

## ముగిసిన రెవెన్యూ సదస్సులు

గట్టు, జూన్ 20 : భూభారతిలో భాగంగా రెవెన్యూ సదస్సులు శుక్రవారం ముగిసాయి. చివరిరోజు మండల కేంద్రంలో 68 దరఖాస్తులను రైతుల నుంచి అధికారులు స్వీకరించారు. కాగా, మొత్తంగా 779 దరఖాస్తులు వచ్చినట్లు తాసీల్దార్ మదన్‌మోహన్ గౌడ్ తెలిపారు. కార్యక్రమంలో డీటీ విజయ్‌కుమార్, రెవెన్యూ సిబ్బంది పాల్గొన్నారు.